సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 24 । మే । 2024



రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నారసింహ సుదర్శన హోమానికి వన్నెంరెడ్డి వెంకట కృష్ణారావు దంపతులు (నర్సాపురం) రూ.లక్ష విరాళం సమర్పించారు.



అన్నదాన భవనానికి...

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి సిరిగిరి జగన్నాథరావు దంపతులు (రాజమహేంద్రవరం) రూ.51,116 విరాళం అందజేశారు.

గరిష్టం/కనిష్టం
40.0°/27.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	40.0	27.0
కాకినాడ	36.9	28.4
అమలాపురం	39.0	28.0

న్యూస్‌రీల్

చాముండేశ్వరికి వెండి మకర తోరణం సమర్పణ



అమ్మవారిని దర్శించుకుంటున్న దాత కుటుంబ సభ్యులు

అమలాపురం రూరల్: మండలంలోని బండారు లంక గ్రామంలో విజయ చాముండేశ్వరి అమ్మవారికి భీమవరం అమ్మ సిల్క్ అధినేత మావూరి సుందరరావు రూ.5 లక్షల విలువైన 5 కేజీల వెండితో చేయించిన మకర తోరణం గురువారం సమర్పించారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, మాజీ ఎంపీపీ వుటూకూరి సుబ్రహ్మణ్యస్వామి, ఆలయ కమిటీ సభ్యులు లక్కింశెట్టి నిత్యానందం సత్కరించారు. విజయ చాముండేశ్వరి ఆలయం వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆలయం వద్ద భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

విఘ్నేశ్వరుని హుండీ ఆదాయం రూ.22,79,556

అయినవిల్లి: విఘ్నేశ్వరుని హుండీ ఆదాయాన్ని గురువారం అమలాపురం ఆలయ తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో లెక్కించారు. 56 రోజులకు గాను రూ.22,79,556 ఆదాయం లభించింది. బంగారం 3.5 గ్రాములు, వెండి 290 గ్రాములు, 6 విదేశీనోట్లు లభించాయని ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాలకు పరీక్ష రేపు

అమలాపురం రూరల్: జిల్లావ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో శనివారం డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ల ఉద్యోగాలకు పరీక్ష నిర్వహించనున్నట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు అమలాపురం రూరల్ మండలం భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష నిర్వహిస్తామన్నారు. డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఇన్ ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ అభ్యర్థులను ఉదయం 7.30 నుంచి 8.15 గంటల వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. ఆపై ఆలస్యంగా వచ్చిన వారిని గ్రేస్ పీరియడ్లో 8.30 గంటల వరకు అనుమతిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 180 మందికి ఒకే పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

తాత్విక జ్ఞానమనేది సర్వరోగ నివారిణి

– శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా, ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా



మాట్లాడుతున్న ఉమర్ ఆలీషా

పిఠాపురం: మానవులకు తాత్విక జ్ఞానం అనేది సర్వరోగ నివారిణి అని శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా,ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా గురువారం పీఠం ఆశ్రమ ప్రాంగణంలో నిర్వహించిన ఆధ్యాత్మిక సభలో ఆయన భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అరిషడ్వర్గాల మాయలో భ్రాంతికి గురవుతూ, తద్వారా అనేక రకాల ఒత్తిళ్లకు లోనవుతూ జీవితాన్ని అస్తవ్యస్తం చేసుకుంటున్న మానవుడు గురు ముఖంగా తాత్విక జ్ఞానం పొందడం ద్వారా జీవితాన్ని సుఖమయం చేసుకోవచ్చన్నారు. కుటుంబ వ్యవస్థను పటిష్టంగా ఉంచేదే ఆధ్యాత్మిక తాత్విక జ్ఞాన సంస్కృతి అని, మానవుడు మాయ భ్రాంతుల నుంచి బయటపడడానికి సృష్టిలో ప్రతి వస్తువును, జీవులను బ్రహ్మ స్వరూపంగా గుర్తించగలగడానికి గురువు బాటలో పయనించి బ్రహ్మ జ్ఞానాన్ని పొందాలని తెలిపారు. ఆధ్యాత్మిక భావనలు వికసింపజేసే జ్ఞానతత్వం వల్ల మానవునిలో మానసిక తత్వం చైతన్యవంతమవుతుందని విశ్లేషించారు. సర్వ మతాల సారాంశం ఒక్కటేనని తెలిపారు. ధర్మ సూత్రాలను వినడమే కాకుండా, వాటిని ఆచరించడం ద్వారా హింస తీవ్రవాదం, ఉగ్రవాదం నిర్మూలింపబడే విధంగా మానవతా విలువలు పెంపొందించుకోవాలని హితవు పలికారు. ప్రతి వ్యక్తి దినచర్యలో భాగంగా కొద్దిపాటి సమయాన్ని తప్పనిసరిగా జ్ఞాన, ధ్యాన, మంత్ర సాధనకు కేటాయించాలన్నారు. పుడమితల్లి సూర్య భగవానుడి తీక్షణమైన కిరణాలతో పునీతమై, మానవులకు సిరి సంపదలను అందజేయడానికి, సస్యశ్యామలం కావడానికి అనుకూలమైన కాలం వైశాఖమాసమని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి విశ్వర్షి వాసిలి వసంతకుమార్ రచించిన జీవన సంహిత పుస్తకాన్ని, 'చిన్న సంకల్పం పెద్ద ఆశీస్సు' వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

డిమాండ్ బ్రహ్మాండం

- కేజీ రూ.వేయి పలుకుతున్న చింత చిగురు
- రుచిలోనే కాదు.. ఆరోగ్యానికి సైతం మేలు
- పలు రకాల పోషకాలు.. యాంటీ ఇన్ఫ్లమేటరీ, డైటరీ ఫైబర్లు
- శరీరంలో ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి దోహదం
- గుండె జబ్బుల నివారణకు మేలు... వైరల్ జ్వరాలకు విరుగుడు
- శాకాహార.. మాంసాహారాల్లో అధికంగా వినియోగం
- హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి

చింత చిగురు



సాక్షి అమలాపురం: ఆతిథ్యానికి మారుపేరుగా నిలిచే గోదావరి వాసులు రకరకాల వంటకాలతో అతిథులకు భుక్తాయాసం తెప్పించడమే కాదు.. సొంతంగా రుచి చూసేందుకు సైతం వివిధ రకాల వంటకాలు సిద్ధం చేసుకుంటారు. అందునా సీజన్ వారీ వంటలకు గోదారోళ్లు పెట్టింది పేరు. వరదల సీజన్‌లో పులస పులుసుతో దేశీయంగా గుర్తింపు సంతరించుకున్న గోదావరి జిల్లాలు అంతకన్నా రుచికరమైన.. విభిన్నమైన వంటకాలకు ప్రసిద్ధి. అటువంటి వాటిలో చింత చిగురుతో చేసే వంటకాలు మరీ ప్రత్యేకం. రుచిలోనే కాదు... ఆరోగ్యానికి కూడా చింత చిగురు మేలు చేస్తుంది. అందుకే దీనికి డిమాండ్ పెరిగింది.

చింత చిగురుతో చేసే శాకాహార, మాంసాహార వంటల రుచికి ఫిదా కానివారంటూ ఉండరు. చైత్ర మాసం దాటిన వెంటనే చింతచెట్టు చిగురించిన ఆకుని సేకరించి అమ్మకాలు చేస్తారు. ఒకప్పుడు వచ్చినట్టు ఇప్పుడు చింతాకు మార్కెట్‌కు రావడం లేదు. గతంలో చింత చెట్లు పల్లె ప్రాంతాల్లోనూ, రోడ్ల పక్కన విరివిగా ఉండేవి. గ్రామాలు, రోడ్ల విస్తరణతో ఆయా చోట్ల వీటిని తొలగించారు. వాటి స్థానంలో కొత్తగా ఎక్కడా చింత చెట్లను నాటడం లేదు. ఫలితంగా వీటి సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. దీంతో పల్లెలకు దూరంగా ఉంటున్న చింత చెట్ల నుంచి చిగురు సేకరణకు ఆసక్తి చూపడం లేదు. చిగురు కోయడానికి ఎక్కువ కూలీ సొమ్ము చెల్లించాల్సి వస్తోంది. దీని వల్లే ధర పెరిగిపోతోందని చింతాకు విక్రయించే అంబాజీపేట మండలం గంగలకుర్రు అనంతలక్ష్మి 'సాక్షి'కి తెలిపారు. చెట్టు చివరి భాగంలో ఉండే లేత చిగురు చెట్లు ఎక్కి కోసేవారు తగ్గడం వల్ల చింతాకుకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది.

పెరిగిన వినియోగం

గుప్పెడు చింతాకు ధర రూ.25 పలుకుతోంది. ప్రస్తుత మార్కెట్‌లో వంద గ్రాముల చింత చిగురు ధర రూ.100 వరకు ఉంది. కేజీ రూ.వెయ్యి. గత ఏడాది దీని ధర రూ.500 మాత్రమే. ఈ ఏడాది రెట్టింపయ్యింది. వారపు సంతలు, రోజువారీ సంతలు, ఇళ్లకు వచ్చేవారి వద్ద చింతాకును ఎగబడి కొంటున్నారు. కాలక్రమంలో పల్లెటూళ్లలో చింత చిగురు వినియోగాన్ని తగ్గించారు. కానీ మారిన జీవనశైలి, ఆరోగ్యంపై పెరిగిన శ్రద్ధ, యూట్యూబ్ చానళ్లు, సోషల్ మీడియా, టీవీల్లో ప్రసారమయ్యే వంటకాల్లో చింత చిగురులో ఉన్న పోషక విలువలు, ఔషధ గుణాల గురించి పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుండడంతో ఇప్పుడు పల్లెలు కంటే పట్టణాలు, నగరాల్లోనే దీని వినియోగం బాగా పెరిగింది. ఏడాదిలో జూన్, జులైలో మాత్రమే ఇది దొరుకుతుంది. గతం కంటే అర్బన్ ప్రాంతాల్లో ఏటికేడాది డిమాండ్‌తో పాటు ధర కూడా పెరుగుతోంది. హైదరాబాద్ వంటి ప్రాంతాలకు సైతం చింత చిగురు ఎగుమతి అవుతుండడం వల్ల దీనికి రాను రాను డిమాండ్ పెరిగిపోతోంది.

పలు రకాల వంటలు

చింత చిగురుతో చేసే శాకాహార, మాంసహార వంటకాలకు లెక్కే లేదు. అటు శాకాహారానికి.. ఇటు మాంసాహారానికి అదనపు రుచిని తీసుకువస్తోంది. చింత చిగురు పప్పు, చింతాకు కూర (ఉల్లిపాయలు వేసి), చింత చిగురు... పనస పిక్కల కూర శాకాహారుల జిహ్వ చాపల్యాన్ని చల్లారుస్తుంది. ఇంకా దీనితో చట్నీ, పులిహోర, రసం తయారు చేస్తారు. చింత చిగురుతో చేసే మాంసాహార కూరలకు సైతం మంచి డిమాండ్ ఉంది. చింత చిగురు పచ్చిరొయ్యల రుచికి దాసోహం కాని మాంసాహారులు ఉండరు. కోనసీమ నుంచి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలోని బంధుమిత్రులకు కూరలు తయారు చేసి పంపేవారు ఉంటారు. చింతాకుతో ఎండు రొయ్యల కలిపి కూడా కూరలు చేస్తారు. ఇక మేక బోటీని చింతచిగురుతో కలిపి చేస్తే దాని రుచి అమోఘమే! ముద్ద నోటిలో పెట్టుకుంటే వేడివేడి అన్నంలో వెన్నపూసలా నమల కుండానే కరిగిపోతుందని మాంసప్రియులు లొట్టలు వేస్తూ గొప్పలు చెబుతారు. ఇవే కాకుండా చింతాకు మాంసం, చింత చిగురు మదుళ్ల (చిన్న రకం చేపలు), చింత చిగురు కొతుకు పరిగి (చేప పిల్లలు) కూరలు సైతం రుచిలో అద్భుతం.

ఆరోగ్యానికి ఔషధం

చింత చిగురు ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. చింత చిగురులో ఎక్కువ ప్రొటీన్లు, తక్కువ కొవ్వు పదార్థాలు, ఎక్కువ మోతాదులో ఔషధ గుణాలుంటాయి. ప్రతి వంద గ్రాముల చిగురులో 5.8 గ్రాముల ప్రొటీన్లు, 10.6 గ్రాముల పీచు పదార్థం, 100 మిల్లిగ్రాముల కాల్షియం, 140 మిల్లీగ్రాముల ఫాస్పరస్, 26 మి.గ్రా.ల మెగ్నీషియం, విటమిన్-సి 3 మి.గ్రా.లు ఉంటుంది. దీనిలో ఎక్కువగా వున్న ఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్టరాల్‌ను పెంచుతాయి.

- చింత చిగురులో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు న్నాయి. చింత చిగురును ఉడికించి నీటిని పుక్కిలిస్తే గొంతు నొప్పి, మంట, వాపు తగ్గుతాయి. దీనిలో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. దీంతో ఇది సహజ సిద్ధమైన లాక్సేటివ్‌గా పనిచేస్తుంది. దీని వల్ల మలబద్ధకం సమస్య తొలగిపోతుంది. చింత చిగురు పైల్స్ ఉన్న వారికి నివారణగా ఉపయోగపడుతుంది.
- వైరల్ ఇన్ఫెక్షన్లతో వచ్చే జ్వరాన్ని చింత చిగురు తగ్గిస్తుంది. నోటి పూతకు చింత చిగురు నివారిణిగా పనిచేస్తుంది. గుండె జబ్బులు రాకుండా చూస్తుంది. శరీరంలో ఎర్రరక్త కణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. రక్తాన్ని శుద్ధి చేస్తుంది. కడుపులో నులి పురుగుల సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు చింత చిగురు మంచి ఔషధంగా పనిచేస్తుంది.
- జీర్ణాశయ సంబంధ సమస్యలను తగ్గిస్తుంది. చింత చిగురులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తరచూ చింత చిగురును తింటే ఎముకలు ధృఢత్వాన్ని సంతరించుకుంటాయి.
- థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న వారు చింత చిగురును తమ ఆహారంలో భాగం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. సుగర్ వ్యాధిగ్రస్తులు చింత చిగురు తింటే రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. చింత చిగురును ముద్దగా దంచి కీళ్లపై ఉంచితే నొప్పులు, వాపులు తగ్గిపోతాయి. ఆర్థరైటిస్ సమస్యతో బాధ పడుతున్న వారికి చింతచిగురు మేలు చేస్తుంది. కంటి సంబంధ సమస్యలను కూడా చింత చిగురు దూరం చేస్తుంది. కళ్లు దురదగా ఉన్నప్పుడు కొంత చింత చిగురు తింటే ఉపశమనం కలుగుతుంది.



చింత చిగురుతో చేసిన వంటకం

సీజన్‌లో తినాల్సిందే..



చిన్ననాటి నుంచి చింతచిగురుతో చేసిన శాకాహార, మాంసాహార కూరలు తినడం అలవాటు. హైదరాబాద్‌లో ఉన్నా సరే చింతచిగురుతో చేయించిన కూరలు మా ఆత్రేయపురం నుంచి ప్రత్యేకంగా రప్పించుకుంటాం. బంధువులు, స్నేహితులు హైదరాబాద్ వస్తే చింత చిగురు కూరలు పట్టుకుని వస్తారు.

– నడింపల్లి నాగార్జున వర్మ, హైదరాబాద్.

విటమిన్లను శరీరంలో నిక్షిప్తం చేస్తాయి



చింతచిగురు లేత ఆకులలో విటమిన్ సీ (ఆస్కార్బిక్ ఆమ్లం) పుష్కలంగా ఉంటుంది. లేత ఆకులు నీటిలో కరిగే విటమిన్లను శరీరంలో నిక్షిప్తం చేస్తాయి. పిండి పదార్థాలు, కొద్దిపాటి ప్రొటీన్లతోపాటు పీచు పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. బీటా కెరోటిన్, కాల్షియం, పోటాషియం వంటి పదార్థాలుంటాయి.

– కడలి సాయిరామ్, ఎన్‌జీసీ కో ఆర్డినేటర్, వృక్ష శాస్త్ర నిపుణుడు, అంబాజీపేట

నేటి నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

పది పరీక్షలకు 3,007, ఇంటర్‌కు 8,748 మంది విద్యార్థులు

రాయవరం/అమలాపురం టౌన్ : పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు నిర్వహించే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి జిల్లాలో ప్రారంభం కానున్నాయి. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా అధికారులు పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షల హాల్ టికెట్లను డీజీఈఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌తో పాటుగా, ఇంటర్ హాల్ టికెట్లను బీఐఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఇప్పటికే పలువురు విద్యార్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరయ్యేందుకు సన్నద్ధమయ్యారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని వారికి నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు పది సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఫలితాల వెల్లడి రోజునే షెడ్యూల్ విడుదల చేసింది. గతంలో మాదిరిగా కాకుండా సప్లిమెంటరీ విద్యార్థులను కూడా రెగ్యులర్‌గానే పరిగణించనున్నారు. కోనసీమ జిల్లాలో 16 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలను నిర్వహించేందుకు అధికారులు చర్యలను చేపట్టారు.

సీఎస్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్ల నియామకం

ఈ ఏడాది నిర్వహించిన పది పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులతో పాటుగా, గతంలో ఫెయిలైన విద్యార్థులు కలిపి 3,007 మంది వివిధ సబ్జెక్టుల పరీక్షలను రాయనున్నారు. సైన్స్ పరీక్షకు అత్యధికంగా 2,120, హిందీ పరీక్షలకు అత్యల్పంగా 471 మంది హాజరుకానున్నారు. అన్ని సబ్జెక్టులకు కలిపి 3,007 మంది పరీక్షలు రాయనున్నారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లను పరీక్షల విభాగం ఆయా పాఠశాలలకు పంపించగా, హాల్ టికెట్లను హెచ్‌ఎంలు డౌన్‌లోడ్ చేసి, విద్యార్థులకు అందజేశారు. పదవ తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరగనున్నాయి. పరీక్షల విధులకు 16 మంది వంతున సీఎస్‌లను, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు. పరీక్షలను సమర్థంగా నిర్వహించేందుకు ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, సీఎస్‌లతో సమావేశాన్ని కూడా నిర్వహించారు.



అమలాపురంలోని ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ థియరీ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో సోమశేఖరరావు, పరీక్షల కమిటీ ప్రతినిధులు

ఇంటర్‌కు 21 పరీక్షా కేంద్రాలు

జిల్లాలో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి 21 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 24 నుంచి 31వ తేదీ వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం నిర్వహించే పరీక్ష మాత్రం నిర్ధేశించిన పరీక్షా కేంద్రాల్లోనే నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా 21 పరీక్షా కేంద్రాల్లో 8,748 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఫస్టియర్ జనరల్ 6,438, సెకండియర్ జనరల్ విద్యార్థులు 1,295, ఫస్టియర్ ఒకేషనల్ 696, ఒకేషనల్ సెకండియర్ 319 మంది హాజరు కానున్నారు. ప్రథమ సంవత్సరం మొత్తం 7,134, సెకండియర్ 1,614 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, 12 ప్రభుత్వ, ఒక ఎయిడెడ్, ఎనిమిది ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి 21 మంది చీఫ్ సూపరింటెండెట్లు, కస్టోడియన్లను నియమించారు. విద్యార్థులు కేంద్రానికి అరగంట ముందుగా చేరుకోవాల్సి ఉంటుంది.

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించండి

– కలెక్టర్ శుక్లా, ఎస్పీ శ్రీధర్

సాక్షి అమలాపురం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా కోరారు. కలెక్టరేట్‌లో పోటీలో ఉన్న అభ్యర్థులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పోటీలో ఉన్న అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్లు పాటించాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందన్నారు. ఇందుకు రాజకీయ పార్టీలు సహకరించాయన్నారు. అదే స్ఫూర్తితో ఓట్ల లెక్కింపును కూడా విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక సంఘటనల నేపథ్యంలో ఎన్నికల సంఘం భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేసిందన్నారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు కౌంటింగ్ సిబ్బందికి రెండు దఫాలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ శుక్లా తెలిపారు. ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూము వద్ద సెంట్రల్ పారా మిలటరీ దళాలు ఆయుధాలతో 24/7 భద్రత కల్పిస్తున్నాయని, రెండో దశలో రాష్ట్ర ఆర్మ్‌డ్ పోలీస్ బలగాలు, మూడో దశలో సివిల్ పోలీసులతో మూడంచెల భద్రత కల్పిస్తున్నామన్నారు. అభ్యర్థుల విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు పూర్తిగా నిషేధమని ఆయన స్పష్టం చేశారు. 214 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కౌంటింగ్ ప్రక్రియను చిత్రీకరిస్తామన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా, ఎస్పీ శ్రీధర్

ఏర్పాట్లు పూర్తి

ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడారు. కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో జూన్ 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపునకు సంబంధించి జిల్లాలో 7 అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన టేబుళ్ల వివరాలను అధికారులు వెల్లడించారు. అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు సంబంధించి రామచంద్రపురానికి 10 టేబుళ్ల చొప్పున, పి.గన్నవరానికి 12 టేబుళ్లు, రాజోలు, ముమ్మిడివరానికి 14 టేబుళ్ల చొప్పున, కొత్తపేట అసెంబ్లీకి 14, లోక్‌సభకు 10, అమలాపురం అసెంబ్లీకి 14, లోక్‌సభకు 12, మండపేట అసెంబ్లీ, పార్లమెంట్‌కు 10 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేశారు.

రోటరీకి రూ.8.30 లక్షల విరాళం

అందించిన మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు: రోటరీ ఇంటర్నేషనల్ సంస్థకు నిడదవోలు మునిసిపల్ చైర్మన్, రోటరీ సీనియర్ సభ్యుడు భూపతి ఆదినారాయణ రూ.8.30 లక్షల భారీ విరాళాన్ని అందించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో గురువారం ఆయన స్థానిక రోటరీ ఆడిటోరియంలో ఆ క్లబ్ నిడదవోలు శాఖ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులుకు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ పోలియో, పేదరిక నివారణ, విద్య, వైద్యం వంటి రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా రోటరీ ఇంటర్నేషనల్ సంస్థ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఇందుకోసం ప్రపంచంలోని అన్ని దేశాల నుంచి ఆ సంస్థకు విరాళాలు అందుతాయన్నారు. పేదలకు సేవ చేయడంలోనే అసలైన ఆత్మ సంతృప్తి లభిస్తుందన్నారు. అనంతరం భూపతి ఆదినారాయణను రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ సభ్యులు అభినందించారు. క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు మాట్లాడుతూ రోటరీ సంస్థ, నిడదవోలు పట్టణాభివృద్ధికి ఆదినారాయణ చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, గుంటిపల్లి శివకుమార్, కొత్తపల్లి నాగేశ్వరరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, గొన్నాబత్తుల రామారావు, యాసరపు రామకృష్ణ, మద్దుల సత్యనారాయణ, చిక్కాల రాజా, ఆకుల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యకు భరోసా

- అటు ప్రభుత్వ వైద్య కళాశాల, ఇటు బోధనా ఆస్పత్రి
- అమలాపురంలో శరవేగంగా పనులు
- ఇప్పటికే 65 శాతం పూర్తి

అమలాపురం టౌన్: చేరువలో చదువుల కోవెల ఉంటే.. ఆరోగ్యానికి పూర్తి భరోసా లభిస్తే ఆ ఆనందమే వేరు. అందుకే విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యం ఇస్తోంది. పేదలకు సకల సౌకర్యాలూ కల్పిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాకు ప్రభుత్వ వైద్య విద్య, ఉచిత ప్రభుత్వ వైద్య సేవలు త్వరలో మరింత చేరువ కానున్నాయి. అమలాపురం మండలం కామనగరువు, సమనస గ్రామాల సరిహద్దుల్లో రాష్ట్ర ప్రభుత్వం 54 ఎకరాలను సేకరించి రూ.450 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాలను నిర్మిస్తోంది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు సైతం ప్రభుత్వపరంగా వైద్య విద్యను అభ్యసించేందుకు మార్గం సుగమమవుతోంది. అమలాపురంలో ఈ వైద్య కళాశాలల నిర్మాణ పనుల వేగం పుంజుకుంది. ఇది అందుబాటులోకి వస్తే ఏటా దాదాపు 150 మెడికల్ సీట్లతో విద్యార్థులు వైద్యను అభ్యసించే అవకాశం ఏర్పడుతుంది. ఇంత వరకూ ప్రభుత్వ వైద్య విద్య కోసం ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు విద్యార్థులు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. అమలాపురంలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల అందుబాటులోకి వస్తే ఈ పరిస్థితులన్నీ దాదాపు దూరం కానున్నాయి. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఎవరైనా వైద్య విద్య అభ్యసించాలంటే రూ.లక్షల్లో ఖర్చు అవుతుంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అలాంటి విద్యార్థులకు వైద్య విద్యపరంగా జిల్లాలో ఓ భరోసాగా నిలువనుంది. ఇప్పటికే ఈ కళాశాల నిర్మాణ పనులు దాదాపు 65 శాతం పూర్తయ్యాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థకు చెందిన ఇంజినీర్లు ఈ భవనాలను త్వరితగతిన పూర్తి చేసే దిశగా శ్రమిస్తున్నారు. వచ్చే ఏడాది నాటికి మొత్తం నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందని ఆ సంస్థ ఇంజినీర్ యోగి తెలిపారు.



అమలాపురంలో ప్రభుత్వ వైద్య కళాశాల భవనాల నిర్మాణం

చకచకా సదుపాయాల కల్పన

ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా జిల్లా బోధనా ఆసుపత్రిగా అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 100 పడకలతో ఉన్న ఈ ఆసుపత్రి 650 పడకలుగా జిల్లా స్థాయిలో పెద్దాసుపత్రిగా సేవలు అందించనుంది. ఇప్పటికే ఇక్కడ మౌలిక సదుపాయాల కల్పన పనులు చకచకా జరుగుతున్నాయి. ఏరియా ఆస్పత్రిలో బోధనా ఆసుపత్రి కోసం అప్పుడే ఆపరేషన్ థియేటర్లు, కన్సల్టింగ్ వార్డులు సిద్ధమవుతున్నాయి. ఆ దిశగా యంత్ర పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటు జరుగుతోంది. ఇక ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఈ బోధనా ఆసుపత్రి జిల్లా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించనుంది. ఇప్పుడు ఆసుపత్రిలో 12 విభాగాలకు వైద్య నిపుణులు ఉంటే, అదే బోధనా ఆసుపత్రి హోదా వచ్చాక 24 విభాగాలు ఏర్పడి ఆయా విభాగాలకు ఒక్కో వైద్య నిపుణుడు అందుబాటులోకి రానున్నారు.



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బోధనా ఆసుపత్రి అప్‌గ్రేడేషన్ పనులు

ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్యనభ్యసించే విద్యార్థులు బోధనా ఆస్పత్రిలో కూడా సేవలు అందించి తమ వైద్య విద్యను పూర్తి చేయనున్నారు. ఇప్పటికే నాడు-నేడు పథకంలో రూ.570 కోట్లతో ఏరియా ఆసుపత్రిని పూర్తి స్థాయిలో ఆధునీకరించారు. ఈ అభివృద్ధి అంతా బోధనా ఆసుపత్రి అప్‌గ్రేడ్‌కు ఉపయోగపడుతోంది.

వచ్చే ఏడాదికి అంతా సిద్ధం

అమలాపురంలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల, బోధనా ఆసుపత్రి వచ్చే ఏడాదికి జిల్లా ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని అంచనా వేస్తున్నాం. ఏరియా ఆసుపత్రిలో బోధనా ఆసుపత్రికి అవసరమైన అన్ని సదుపాయాలూ సిద్ధమవుతున్నాయి. దీనివల్ల ప్రజలకు ఉచిత వైద్యం మరింత చేరువవుతోంది. మెడికల్ స్పెషలిస్ట్‌లు, మెడికల్ ఎక్విప్‌మెంట్లు వంటి విషయాల్లో అప్‌గ్రేడ్ సదుపాయాలు వస్తాయి.

–డాక్టర్ పద్మశ్రీరాణి, సమన్వయకర్త, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులు

క్లుప్తంగా

గల్లంతైన వ్యక్తి మృతదేహం గుర్తింపు


వీరబాబు (ఫైల్)

రౌతులపూడి: రౌతులపూడి-కత్తిపూడి ఆర్‌అండ్‌బీ రహదారిలో రౌతులపూడి శివారు ఏలేరు ఎడమ కాలువ వంతెన వద్ద బుధవారం గల్లంతైన గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన సీకోలు వీరబాబు గురువారం ఏలేరు కాలువలో సమీప ప్రాంతంలోనే శవమై తేలాడు. రౌతులపూడి పోలీసులు బుధవారం రాత్రి నుంచి స్థానికుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టగా గురువారం సమీప ప్రాంతంలో శవాన్ని గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన సీకోలు వీరబాబు రౌతులపూడిలో తమ బంధువుల ఇంటికి ఫంక్షన్‌కు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో రౌతులపూడి శివారున ఉన్న ఏలేరు కాలువలో స్థానికులతో కలసి స్నానానికి దిగాడు. స్నానానికి దిగిన వీరబాబు ఎంతకీ కనిపించకపోవటంతో రౌతులపూడిలో ఉంటున్న వీరబాబు బంధువులకు, పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి భార్య కొంతకాలంగా దూరంగా ఉంటున్నారని, తల్లి మృతిచెందడంతో తండ్రి వేరొకరిని వివాహం చేసుకుని వీరబాబును పట్టించుకోకుండా దూరంగా ఉంటున్నారని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తుని ఏరియా ఆసుపత్రికి తరలిస్తామని ఎస్‌ఐ అబ్దుల్ నబీ తెలిపారు.

సెంట్రల్ జైలుకు పరిశ్రమల శాఖ జీఎం మురళి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కాకినాడలో లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కిన జిల్లా పరిశ్రమల శాఖ జీఎం మురళికి కోర్టు వచ్చే నెల 5వ తేదీ వరకు రిమాండ్ విధించింది. బుధవారం రాత్రి కాకినాడలోని జీఆర్‌టీ హోటల్ వద్ద ఐస్ ఫ్యాక్టరీ నిర్వాహకుడి నుంచి లంచం తీసుకుంటూ మురళి పట్టుబడ్డ విషయం విదితమే. గురువారం ఏసీబీ కోర్టు జడ్జి మురళికి రిమాండ్ విధిస్తూ తీర్పునివ్వడంతో ఆయనను. ఏసీబీ అధికారులు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

నవధాన్యాలతో జవసత్త్వాలు

- భూసార పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయం
- ప్రభుత్వ చొరవతో పెరిగిన వైనం
- రైతులను చైతన్య పరుస్తున్న అధికారులు

పిఠాపురం: అధునాతన వ్యవసాయంలో మితిమీరిన రసాయనాలు వాడడం వల్ల పసిడి పంటలు పండే భూములు సహజ శక్తిని కోల్పోయాయి. అలాంటి పరిస్థితుల్లో నేలలను పునరుజ్జీవింప చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూములను సారవంతం చేసే దిశగా అడుగులు వేయాలని, ఎరువులు.. పురుగు మందులకు చెక్ పెట్టి ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. దీనిలో భాగంగా అతి తక్కువ పెట్టుబడితో ఎక్కువ భూసారం సాధించే దిశగా నవ ధాన్యాల సాగుకు ప్రభుత్వం తోడ్పాటు ఇచ్చే చర్యలు తీసుకుంది. పచ్చి రొట్ట సాగుతో పచ్చని పంటలు పండే విధంగా ప్రకృతి వ్యవసాయంపై అధికారులు రైతుల్లో చైతన్యం తీసుకువస్తున్నారు.


పిఠాపురం మండలంలో నవధాన్యాల సాగు చేసిన పొలం

నవ ధాన్యాల సాగుతో భూసారం పెంపు

వివిధ కారణాలతో క్రమంగా భూములు తమ బలాన్ని కోల్పోతున్నాయి. దీంతో సూక్ష్మ పోషక లోపాలు బయటపడుతున్నాయి. ఫలితంగా భారీ పెట్టుబడులు పెట్టినా ఆశించిన దిగుబడులు రాని పరిస్థితి నెలకొంది. పెట్టుబడులు పెరిగి గిట్టుబాటు కాక రైతులు నష్టపోతున్నారు. రానున్న రోజుల్లో భూసారం లేక ఏ పంటలు వేసినా పండని పరిస్థితులు నెలకొననున్నాయి. వాటిని అధిగమించడానికి నవ ధాన్యాల సాగు చేపట్టారు. వీటిని సాగు చేసి భూమిలో కలియ దున్నడం వల్ల భూమిలో సూక్ష్మ పోషక విలువలు వృద్ధి చెంది, భూసారం పెరిగి ఏది సాగు చేసినా బాగా పండుతుంది. భూమి సారవంతంగా ఉండేందుకు దోహద పడే సూక్ష్మ జీవులు వృద్ధి చెంది నత్రజని స్థిరీకరణ జరిగి మొక్కల్లో రోగ నిరోధక శక్తి పెరిగి భూసారాన్ని మరింత పెంచుతాయి. చౌడు సమస్యను నివారించడంతో పాటు నేల నుంచి వచ్చే తెగుళ్లను సైతం ఈ పైర్లు అరికడతాయి. నవ ధాన్యాలు సాగు చేసి దున్నిన భూమిలో పండించిన ధాన్యంలో పోషకాల విలువలు పెరిగినట్టు శాస్త్రవేత్తల పరిశోధనలో నిర్ధారించారు.


సిద్ధం చేస్తున్న నవధాన్యాల విత్తనాలు

కాకినాడ జిల్లాలో నవ ధాన్యాల సాగు లక్ష్యం – 53,253 ఎకరాలు
సాగు చేయడానికి నిర్ణయించిన రైతుల సంఖ్య – 49,895
ఇప్పటి వరకు సాగయిన భూములు – 26,846 ఎకరాలు
విత్తనాలు తీసుకున్న రైతులు – 26,680 మంది
పంపిణీ చేసిన విత్తనాలు – 26 టన్నులు
సాగు చేసిన రైతులు – 26,564 మంది
పంపిణీ చేస్తున్న విత్తనాలు – 31 రకాలు

నవ ధాన్యాల సాగు

నవ ధాన్యాలు అంటే నవగ్రహాల పూజలకు వాడే ధాన్యాలుగానే చాలామందికి తెలుసు. కేవలం దైవ పూజలకు మాత్రమే వాడే నవ ధాన్యాలు ఇప్పుడు రైతుకు వరంగా మారాయి. గోధుమలు, వరి, కందులు, పెసలు, మినుములు, శనగలు, బొబ్బర్లు, నువ్వులు, ఉలవలు వంటి తొమ్మిది రకాల నవ ధాన్యాలు ఇప్పుడు భూసార పెంపులో ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. వీటితో పాటు మరో 22 రకాల ధాన్యం రకాల విత్తనాలను ప్రభుత్వం రైతులకు పంపిణీ చేస్తోంది. పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు, కోళ్ల ఎరువు, గొర్రెల ఎరువు తదితర సహజంగా లభించే ఎరువులు సామాన్య రైతుకు లభ్యం కావడం భారంగా మారింది. వాటి స్థానంలో ప్రతీ రైతుకు అందుబాటులో ఉండే సహజ సిద్ధ ఎరువుల తయారీకి నవ ధాన్యాల సాగు ఒక వరంగా మారింది. జనుము, జీలుగ, పిల్లి పెసర వంటి పచ్చి రొట్ట సాగుతో పాటు నవ ధాన్యాల సాగుకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. తొమ్మిది రకాల ధాన్యాలను రబీకి చివరిలో జల్లుకుని కోతలు పూర్తయ్యాక వాటిని కలియదున్నడం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చు. ఈ విషయంలో అధికారుల సూచనలు, సలహాలతో రైతులు నవ ధాన్యాల సాగు చేపట్టారు.

జిల్లాలో 53 వేల ఎకరాల్లో నవ ధాన్యాల సాగు లక్ష్యం



జిల్లాలో ఈ ఏడాది సుమారు 53 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ శాఖ ద్వారా నవ ధాన్యాల సాగుకు లక్ష్యంగా నిర్ణయించాం. ఇప్పటికే 26 టన్నుల విత్తనాలు పంపిణీ చేయగా 26 వేల మంది రైతులు తమ పొలాల్లో 25 వేల ఎకరాల్లో విత్తనాలు వేసుకుని నవ ధాన్యాల సాగు చేపట్టారు. రబీ పంట చివరిలో నవ ధాన్యాలను చల్లి మొక్కలు ఏపుగా పెరిగిన తరువాత ఖరీఫ్‌కు ముందు కలియ దున్నడం వల్ల భూముల్లో పోషక విలువలు వృద్ధి చెంది భూసారం పెరుగుతుంది. తద్వారా రసాయనిక ఎరువుల వాడకం తగ్గడంతో పాటు తక్కువ పెట్టుబడితో నాణ్యమైన పంటలు పండించగలుగుతారు. ఇలా నాలుగు సంవత్సరాలు నవ ధాన్యాలు సాగు చేసి దున్నడం వల్ల భూసారం సహజ సిద్ధంగా పెరిగి రసాయనిక ఎరువుల అవసరం లేకుండా పంటలు పండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే అన్ని గ్రామాల్లోను రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించడం ద్వారా చైతన్యం తీసుకువచ్చాం. ప్రభుత్వం విత్తనాల పంపిణీ చేస్తుండడంతో రైతుల ముందుకు వస్తున్నారు. త్వరలోనే లక్ష్యం పూర్తి చేస్తాం. ఎకరానికి 10 కేజీల చొప్పున విత్తనాలు రైతులకు పంపిణీ చేస్తున్నాం.

– ఎలియాజరు, జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి, కాకినాడ

మంచి ఫలితాలు



గత ఏడాది అధికారులు ఇచ్చిన విత్తనాలు చల్లి కలియ దున్నడం వల్ల చాలా వరకు ఎరువుల వాడకం తగ్గింది. పూర్వం పశువుల పెంటతో పాటు పచ్చిరొట్ట ఎరువులు వాడే వారు. రానురాను వాటిని మానేసి రసాయనిక ఎరువులు వాడడం ప్రారంభించాక పెట్టుబడులు పెరిగిపోయాయి. మళ్లీ ఇప్పుడు నవధాన్యాలు నాటి దున్నడం వల్ల మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. ప్రకృతి వ్యవసాయంలో ప్రభుత్వం రైతులకు మంచి అవకాశాలు కల్పిస్తోంది. నవ ధాన్యాల సాగు రైతులకు చాలా మంచిది. వీటి వల్ల పెట్టుబడులు తగ్గడంతో పాటు రసాయనిక ఎరువులు లేని పంటలు అందుబాటులోకి వస్తాయి. నేను రెండు ఎకరాల్లో నవ ధాన్యాల సాగు చేశాను. ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు ఇవ్వడంతో పాటు ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు ఇస్తున్నారు. ఇవి సాగు చేయడం వల్ల భూమి సారవంతం కావడంతో ఎరువులు పెద్దగా వేయాల్సిన అవసరం లేకుండా తక్కువ పెట్టుబడితో నాణ్యత గల పంటలు వస్తున్నాయి.

– వారణాశి కామేశ్వరశర్మ, నర్సింగపురం, పిఠాపురం మండలం

హోరాహోరీగా చెస్ పోటీలు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన 8 మంది క్రీడాకారులు


విజేతలతో జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి వెంకట సురేష్ తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురంలో జిల్లా స్థాయి ఓపెన్ చెస్ చాంపియన్ షిప్ పోటీలు గురువారం హోరా హోరీగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా ఈ పోటీల్లో 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఒక ప్రైవేటు స్కూలులో జరిగిన ఈ పోటీలను అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తాడి వెంకట సురేష్ పర్యవేక్షించారు. ఓపెన్ బాలుర విభాగంలో తోలేటి శ్రీకాంత్, ద్రాక్షారపు సాత్విక్, తాడి వెంకటేష్, చింతపల్లి సూర్య విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో గెద్దాడ అక్షయ, బోర్మన్ బ్లెస్సీ, పినిశెట్టి ధరణి, పెదమల్లు జాస్మిత విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలైన నలుగురు బాలురు ఈ నెల 27,28 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర బాలుర చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో తలపడనున్నారు. విజేతలైన నలుగురు బాలికలు ఈ నెల 25,26 తేదీల్లో సత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగే రాష్ట్ర బాలికల చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో సత్తా చాటనున్నారు.

ఘనంగా సత్యదేవుని శ్రీ చక్రస్నానం


కోనేరులో సత్యదేవుని శ్రీచక్రస్నానం. చిత్రంలో ఈఓ రామచంద్రమోహన్, ఇతర పండితులు


నాగవల్లీ పట్టు, దండియాడింపు వేడుకల్లో స్వామి, అమ్మవారి విగ్రహాలతో నాట్యం చేస్తున్న అర్చక స్వాములు

పంపా నదిలో కృత్రిమంగా తవ్విన కోనేరులో నిర్వహణ

అన్నవరం: శ్రీ సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో భాగంగా ఆరో రోజు గురువారం ఉదయం పంపానదిలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు శ్రీచక్రస్నానం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8–30 గంటలకు పెళ్లిపెద్దలు సీతారాములు వెంట రాగా నవ దంపతులు సత్యదేవుడు, అమ్మవార్లను ఊరేగింపుగా పంపా నదీ తీరానికి తీసుకువచ్చారు. అక్కడ కల్యాణ మంటపం లోపల గల సింహాసనంపై స్వామి, అమ్మవార్లను, మరో ఆసనంపై సీతారాములను ప్రతిష్ఠించి పూజలు చేశారు. పండితుల మంత్రోచ్చాటన మధ్య స్వామివారికి, శూలానికి పంచామృతాలతో అవభృత స్నానం చేయించారు. అనంతరం సత్యదేవుని ఉత్సవ మూర్తిని, శూలాన్ని ఊరేగింపుగా పంపా నది వద్దకు తీసుకువెళ్లి మూడు సార్లు చక్రస్నానం చేయించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేడుకగా నాగవల్లీ, దండియాడింపు

సాయంత్రం అనివేటి మంటపంలో స్వామి, అమ్మవార్లకు నాగవల్లి పట్టు, నీలలోహిత ధారణ, దండియాడింపు కార్యక్రమాలను పండితులు నిర్వహించారు. సత్యదేవుడు, అమ్మవార్లను ప్రత్యేక వేదికపై, పెళ్లిపెద్దలు సీతారాములను మరో ఆసనంపై ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రంగులతో నాగవల్లిని తీర్చి దిద్ది పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి నీలలోహిత ధారణ చేశారు. ఈ సందర్భంగా ధ్వజ అవరోహణ చేశారు. అర్చకస్వాములు కంకణ విమోచనం చేశారు. తదనంతరం అర్చకస్వాముల బంతులాట, బిందెలో ఉంగరం వెదకడం వంటివి వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల విగ్రహాలను పట్టుకుని అర్చకస్వాములు నృత్యం చేస్తూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, అర్చకులు కొండవీటి రాజా, పవన్, యడవిల్లి ప్రసాద్ తదితరులు స్వామి, అమ్మవార్ల విగ్రహాలతో నృత్యం చేశారు. వీరిపై అర్చకులు రంగులు చల్లుతూ సందడి చేశారు. సత్యదేవుని ప్రధానాలయంలోని సత్యదేవుడు , అమ్మవార్లకు, రామాలయంలోని సీతారాముల విగ్రహాలపై కూడా రంగులు చల్లారు.

నేడు శ్రీపుష్పయాగం

సత్యదేవుడు, అమ్మవార్ల శ్రీపుష్పయాగం శుక్రవారం రాత్రి నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్వామివారి నిత్య కల్యాణ మంటపంలో శ్రీపుష్పయాగం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. రాత్రి 8–30 గంటల నుంచి పది గంటల వరకు ఈ కార్యక్రమం జరుగతుందన్నారు.

ఒడిశా వాసికి లగేజ్ అప్పగింత

తుని: రైలులో ప్రయాణించిన ఒడిశా రాష్ట్రం కటక్‌కు చెందిన ఉత్తమ్‌కుమార్ సాహుకు నగదుతో కూడిన లగేజ్‌ను అందజేసినట్టు తుని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. సాహు బుధవారం సికింద్రాబాద్ నుంచి కటక్‌కు ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు. రాజమహేంద్రవరంలో రైలు ఎక్కువ సమయం ఆగుతుందని టిఫిన్ చేసేందుకు రైలు దిగారు. టిఫెన్ చేసి వచ్చేసరికి రైలు కదిలిపోయింది. దీంతో సాహు ట్రోల్ ఫ్రీ నంబరు 139కు ఫోన్ చేశారు. దీంతో తుని రైల్వేస్టేషన్‌కు చెందిన ఆర్పీఎఫ్, జీఆర్పీ కానిస్టేబుల్ ప్రసాదరావు, శ్రీనివాసరావు, ఏఎస్సై అనిల్ రైలులోని లగేజ్‌ను దించారు. సూట్‌కేసును తనిఖీ చేయగా రూ.74 వేల నగదు ఉంది. గురువారం తుని స్టేషన్‌కు వచ్చిన ఉత్తమ్‌కుమార్ సాహుకు సూట్‌కేస్‌ను అప్పగించారు. రైల్వే పోలీసులకు సాహూ కృతజ్ఞతలు తెలిపారు.


లగేజ్‌ను ఉత్తమ్‌కుమార్‌కు అప్పగిస్తున్న పోలీసులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఆత్రేయపురం: వెలిచేరు గ్రామానికి చెందిన కైరం నాగశ్రీనివాస్ (34) అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంపై గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వెలిచేరుకు చెందిన నాగశ్రీనివాస్ తన తండ్రి పోతురాజుతో కలసి పొలం పనులకు వెళ్తుండేవాడు. ఆ గ్రామ శివారు పొలం వద్ద నాగశ్రీనివాస్ స్పృహ లేకుండా పడి ఉండడం చూసి స్థానికులు అతడిని వైద్యుడి వద్దకు తీసుకువెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. తండ్రి పోతురాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీనివాస్ వివరించారు.


మృతిచెందిన నాగ శ్రీనివాస్

సెల్ టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

కాకినాడ క్రైం: సెల్‌ఫోన్ దొంగతనాన్ని తనపై వేశారని ఆవేదన చెందిన ఓ వ్యక్తి సెల్‌టవర్ ఎక్కి చనిపోతానంటూ హల్‌చల్ చేశాడు. త్రీ టౌన్ పోలీసుల కథనం మేరకు.. చిత్రాడకు చెందిన ప్రదీప్‌కుమార్‌ను కొన్ని పరిణామాల నేపథ్యంలో సెల్‌ఫోన్ దొంగతనం చేశావంటూ గ్రామంలో పలువురు నిందించారు. తాను దొంగతనం చేయలేదని ఎన్నిసార్లు చెప్పినా వినలేదు. దీంతో మనస్థాపం చెందిన ప్రదీప్ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. గురువారం కాకినాడకు వచ్చి బీఎస్ఎన్ఎల్ ఆఫీస్‌పై ఉన్న సెల్‌ఫోన్ టవర్ ఎక్కాడు. అది గమనించిన అక్కడి వారు కిందికి దిగమని వారించినా వినలేదు. విషయం తెలుసుకున్న కాకినాడ త్రీ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. సీఐ భగవాన్ ఆదేశాల మేరకు ఎస్ఐ సాగర్‌బాబు, పీసీ శ్రీనివాసరావు ప్రదీప్‌కి నచ్చజెప్పారు. అలా మాట్లాడుతూ పైకి ఎక్కి యువకుడిని చేరుకొని కిందికి దించారు. అనంతరం ప్రదీప్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. మనస్థాపంతో బలవన్మరణానికి పాల్పడబోయిన యువకుడిని రక్షించిన త్రీ టౌన్ పోలీసులను ముఖ్యంగా టవర్ ఎక్కి అతడిని చేరుకున్న కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను స్థానికులు అభినందించారు.


ప్రదీప్‌కుమార్‌ను రక్షించిన త్రీ టౌన్ పోలీస్ బృందం

కానిస్టేబుల్‌పై హత్యాయత్నం కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

కాకినాడ లీగల్: ఏఆర్ కానిస్టేబుల్‌పై హత్యాయత్నం చేసిన కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎన్.విజయబాబు గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2020 సంవత్సరంలో కొండయ్యపాలెంకు చెందిన వీధి సుబ్రహ్మణ్యం, సవలం పవన్‌కుమార్, యానం సత్యభవాని శంకర్‌లు కలిసి అదే ప్రాంత్రానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ రాములకొండ బాలరెడ్డిపై చాకుతో దాడి చేశారు. కానిస్టేబుల్ బాలరెడ్డి ఫిర్యాదుపై టూటౌన్ పోలీసు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణ సమయంలో నిందితుడు వీధి సుబ్రహ్మణ్యం మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు నిందితులపై కోర్టు విచారణ చేయగా పవన్‌కుమార్, సత్యభవాని శంకర్ నేరం రుజువుకావడంతో ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఏపీపీ డేనియల్ దినకర్ జీసన్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

ఆయిల్ ట్యాంకర్ పట్టివేత

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న 4 వేల లీటర్ల ఆయిల్ ఉన్న ట్యాంకర్‌ను విజిలెన్స్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. కోరంగి ఎస్సై ఎస్.రవికుమార్ తెలిపిన వివరాల మేరకు జాతీయ రహదారి 216లోని వై.జంక్షన్ వద్ద విజిలెన్స్ తనిఖీలలో నిబంధనలకు విరుద్ధంగా తీసుకువెళుతున్న ఆయిల్ ట్యాంకర్‌ను పట్టుకుని ఎంఎస్ఓ లక్ష్మీ ప్రసన్నకు అప్పగించారు. సుమారు రూ.3.89 లక్షల విలువ చేసే డీజిల్‌ను పటవలలోని రొయ్యల చెరువులకు తరలిస్తున్నట్లు తెలిపారు. 4 వేల లీటర్లు డీజిల్‌తోపాటు అక్రమంగా తరలిస్తున్న ట్యాంకరును సీజ్ చేసినట్లు తెలిపారు. డ్రైవర్ గోవాల సుబ్బారావు, యజమాని అడ్డాల వీరవెంకట సత్యనారాయణను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

'కోడ్'కు లోబడి జెడ్పీ సమావేశం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జిల్లా ప్రజాపరిషత్ అధ్యక్షుడు విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం జరిగింది. అదే విధంగా ఏడు స్థాయీ సంఘాల సమావేశాల్లో 1, 2, 4, 7 స్థాయి సంఘాల సమావేశాలు జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన, 3వ స్థాయీ సంఘ సమావేశం జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు అధ్యక్షతన, 5వ స్థాయీ సంఘ సమావేశం జెడ్పీటీసీ సభ్యురాలు రొంగల పద్మావతి, 6వ స్థాయీ సంఘ సమావేశం జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత అధ్యక్షతన నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం సర్క్యులర్ ప్రకారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున, ప్రవర్తనా నియమావళికి లోబడి సమావేశాలు నిర్వహించారు. ఏ విధమైన శాఖాపరమైన సమీక్షలు గాని, తీర్మానాలు చేయకుండా సమావేశాలను ముగించారు. ఈ సమావేశాల్లో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో జీఎస్ రామ్‌గోపాల్, అయా జిల్లాల వివిధ శాఖల అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు, జెడ్పీ పరిపాలనాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు తదితరులు

డిగ్రీ ఫలితాలలో 90.7 శాతం ఉత్తీర్ణత


డిగ్రీ ఫలితాలను విడుదల చేస్తున్న రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శోభారాణి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో 90.7 శాతం ఫలితాలు సాధించిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. జోన్ 1, 2 రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శోభా రాణి ఈ ఫలితాలను గురువారం విడుదల చేశారన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపులకు సంబంధించి 753 మంది విద్యార్థులకు 683 మంది పాస్ అయ్యారని తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరంలో ప్రారంభించనున్న సర్టిఫికెట్ కోర్సులను డాక్టర్ శోభారాణి సమీక్షించారన్నారు. బీఏ టూరిజం హాస్పిటాలిటీ, బీఎస్సీ ఇండస్ట్రియల్ మ్యాథమెటిక్స్‌తో కూడిన కొత్త డిగ్రీ ప్రోగ్రామ్‌లు, ఇంటర్న్‌షిప్‌ల్లో సమగ్రత సాధించడంపై చర్చించామన్నారు. అకడమిక్ సమన్వయకర్త డాక్టర్ డి.సంజీవ్‌కుమార్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఎ.అన్నపూర్ణ, పరీక్షల నియంత్రణాధికారి పి.బాబ్జీ, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ గోకవరపు చంద్రశేఖర్, ఏఆర్‌సీ కోఆర్డినేటర్ సీహెచ్.సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.